విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శన

ఇబ్రహీంపట్నం: కస్తూర్బాలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, ఫిబ్రవరి 11: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలతో పాటూ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, గురువులకు పేరు తీసుకురావాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌసూర్ రహ్మాన్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఆయా కళాశాలల అధ్యాపకులు, బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, నాయకులు సజ్జు, అతీక్ తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. ఇబ్రహీంపట్నంలోని కస్తూర్బా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిసరాలు, వంటశాల, తరగతి గదులను ఆయన పరిశీలించారు. భోజనం, వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎలాల దశరథ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు జాజాల జగన్‌రావు, నేమూరి సత్యనారాయణ, జేడీ సుమన్, శ్రీనివాస్, రాజేందర్, రాజాగౌడ్ తదితరులున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌లోని వైఎస్ కళాశాలలో యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రీయా కుమారి, మనీష ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ ద్వారా వలంటీర్లు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసి వచ్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ శాలువాలతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్‌కుమార్, చంద్రయ్య, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ వాసవి, నీరజ, రామచంద్రం, మల్లికార్జున్, జమున, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా బీసీ సంఘం నాయకులు

జగిత్యాల, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, ఎల్ రమణను జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి, చట్టబద్ధత కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, నాయకులు కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్, రాచకొండ రోజా, బొమ్మిడి నరేశ్‌కుమార్, అనుమల్ల సంజయ్ సామ్రాట్, బండపెల్లి మల్లీశ్వరి, రాపర్తి రవి, యాగండ్ల రమేశ్ గౌడ్, కాసారం సతీశ్ గౌడ్, పాలెం జలందర్, హరీశ్ గౌడ్, రొట్టె శ్రీధర్, లింబాద్రి గౌడ్, అంజయ్య, హృషికేష్, బండపెల్లి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పసుపు క్వింటాల్ @ రూ.11,211

మెట్‌పల్లి, ఫిబ్రవరి 11: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.11,211, కనిష్ఠ ధర రూ.4,006, పసుపు గోళ (మండ)కు గరిష్ఠ ధర రూ.9,516, కనిష్ఠ ధర రూ.5 వేలు, పసుపు చూరకు గరిష్ఠ ధర రూ.10,111, కనిష్ఠ ధర రూ.7,166 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 2374 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అవసరం

కథలాపూర్, ఫిబ్రవరి 11: విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అవసరమని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మాస్టో పాఠశాలలో మంగళవారం కిడ్స్ సైన్స్–2025 వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రయోగాలను తల్లిదండ్రులతోపాటు ఎంఈవో శ్రీనివాస్ తిలకించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఆయా పార్టీల నాయకులతో సమావేశం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 11: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాల్లో అభ్యంతరాలపై ఈనెల 13న ఉదయం 11.30 గంటలకు ఆయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఖాదీ కాంప్లెక్స్, శాఖ- 20145, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా-505 325.

స్వాధీనతా ప్రకటన
రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాదీ కాంప్లెక్స్ శాఖ-20145, మెట్‌పల్లి** అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3 మరియు చట్టంలోని సెక్షన్ 13(2)తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత మరియు హామీదారుకు 29-11-2024 **తేదీగల డిమాండ్ నోటీసు** జారీ చేసి, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తం 29-11-2024 నాటికి **రూ. 20,28,917/- (ఇరవై లక్షల ఇరవై ఎనిమిది వేల తొమ్మిది వందల పదిహేడు రూపాయలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతున్నారు.
రుణగ్రహీత: శ్రీ అబ్దుల్ మతీన్ తండ్రి అబ్దుల్ గని, ఇంటి నం. 1-2-161, ముస్లింపురా, మెట్‌పల్లి-505325, సెల్ నెం.8297666364, 9989172867, **అకౌంట్ నం. 37727071892 H/L, 37789716171 సురక్ష, 39350945047 టాప్‌అప్.**
రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు దిగువ వివరించబడిన ఆస్తిని 05-02-2025న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవి నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు 29-11-2024 నాటికి **రూ. 20,28,917/- (ఇరవై లక్షల ఇరవై ఎనిమిది వేల తొమ్మిది వందల పదిహేడు రూపాయలు మాత్రమే)** + ఏవైనా తదుపరిగా చెల్లించిన మొత్తాన్ని తగ్గించుకుని సదరు మొత్తం కొరకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాదీ కాంప్లెక్స్ శాఖ, మెట్‌పల్లి** యొక్క చార్జ్‌కు లోబడి ఉంటాయని ప్రత్యేకించి రుణగ్రహీతను/హామీదారును మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లో నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

స్థిరాస్తి వివరణ
రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 2224/2016, తేది: 07-09-2016 ప్రకారం **అబ్దుల్ మతీన్ తండ్రి** గని పేరున గల రిజిస్ట్రేషన్ జిల్లా మరియు జిల్లా పరిషత్ కరీంనగర్, రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా, తహసీల్ కార్యాలయం మెట్‌పల్లి మరియు మెట్‌పల్లి మున్సిపాలిటీ శివారు వద్ద గల, 296.66 చ.గజాలు లేదా 248.03 చ.మీటర్లు మొత్తం విస్తీర్ణం, సర్వే నెం.820/ఇలో ఖాళీ ప్లాట్ యావత్తు, **సరిహద్దులు:** తూర్పు: 33 అ.వెడల్పు రోడ్డు, పడమర: బొల్లుమల్ల గంబాలు ఇల్లు, ఇం.నెం.1-7-3/1/1, ఉత్తరం: అర్కల వెంకస్వామి ఖాళీ స్థలం, దక్షిణం: Md నసీర్ ఇల్లు ఇంటి నం. 1-7-3/2,

ప్రదేశం: కోరుట్ల
తేది: 05-02-2025
సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విద్యార్థులకు అవగాహన

వెల్గటూర్, ఫిబ్రవరి 11: చెగ్యాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాలతో ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలో మంగళవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అవగాహన కల్పించారు. టీం కమాండెంట్ ముకేశ్, తహసీల్దార్ ఆర్ శేఖర్, ఆర్ఐ రాజేశ్వరి, మండల విద్యాధికారి ప్రభాకర్, సీహెచ్‌వో జగన్నాథం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పోలీసులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

కొడిమ్యాల(మల్యాల), ఫిబ్రవరి 11: కాంగ్రెస్ సర్కారు రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణు పేర్కొన్నారు. మల్యాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ కాలేదన్నారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు గాజుల మల్లేశం, పిల్లి రాజశేఖర్, పొనగంటి గౌతం, మహేశ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 11: కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పురాతన హైస్కూల్, ఫోర్ట్ హైస్కూల్, న్యూ హైస్కూల్ విద్యార్థులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. కాగా, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. అలాగే, హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్, ఇద్దరు మదర్సా విద్యార్థులు వెండి పతకాలు సాధించగా అభినందించారు. అలాగే, జగిత్యాలకు చెందిన జోయా ఆనం బెస్ట్ రైజింగ్ స్టార్, కరాటే శిక్షకురాలు జువేరియా బేగం బెస్ట్ మాస్టర్ ఇన్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ అవార్డు సాధించగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్, ఆరుముల్ల పవన్, భరత్, మైమునా, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

జగిత్యాల, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్య చేసుకున్నా విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలో 'వృద్ధుల ఆత్మహత్య–పిల్లల వేధింపులు, అభద్రత, నివారణ' అంశంపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు, పీసీ హన్మంత రెడ్డి, బొల్లం విజయ్, ఎండీ యాకుబ్, పూసాల అశోక్ రావు, కొయ్యడ సత్యనారాయణ, డిండిగాల విఠల్, సూర్యనారాయణ రాజు, వేముల దేవరాజం, పూటురి గౌరీశంకర్, సీనియర్ న్యాయవాది సతీశ్ రాజ్, మానాల కిషన్, సింగం గంగాధర్, నక్క ఇంద్రయ్య, కండ్లే గంగాధర్, దుబ్బేశం, నారాయణ, సయ్యద్ యూసుఫ్, ఎండీ ఎక్బాల్, జాఫర్, కాలగిరి గంగారెడ్డి, పబ్బా శివానందం, వొజ్జల బుచ్చిరెడ్డి, ప్రభాకర్ రావు, రాజ్‌మోహన్, లక్ష్మీనారాయణ, కస్తూరి సుధాకర్, జంగిలి రామానందం, కుంటాల కిషన్, ఉప్పుగల్ల మురళి, వేణుగోపాల్ రావు, మహిళా ప్రతినిధులు బైరి రాధ, కస్తూరి శ్రీ మంజరి, జలజ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

'పది' ఇంటర్నల్ మార్కుల రికార్డుల తనిఖీ

మార్కుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కుల రికార్డులను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వచ్చిన మార్కులు, జవాబు పత్రాలను పరిశీలించారు. ఇక్కడ అధికారులు ఆనంద్, ప్రణయ్‌కుమార్, వెంకట సుధీర్, పాఠశాల కరస్పాండెంట్ బారీ, ప్రిన్సిపాల్ సెలీనా, చైర్మన్ హదీ, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీజీఆర్ఎఫ్ సంస్థ చైర్మన్ నారాయణ

విద్యుత్ సమస్యల పరిష్కారమే సీజీఆర్ఎఫ్ లక్ష్యం

- సంస్థ చైర్మన్ ఎరుకల నారాయణ

కోరుట్ల, ఫిబ్రవరి 11: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీజీఆర్ఎఫ్ పని చేస్తున్నదని సంస్థ చైర్మన్ ఎరుకల నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని కల్లూరు రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా సంస్థ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ, కోరుట్ల డివిజన్ పరిధిలో 60 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. వేసవిలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ధ్యేయంగా అధికారులు పని చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో కరెంట్ బిల్లులు చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు. రైతులు మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కరెంట్ సరఫరాలో తరచూ అంతరాయం, హెచ్చు తగ్గులు, మీటర్ల సమస్యలు, అధిక బిల్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్‌లోడ్‌తో దగ్ధమవడం, స్తంభాల మార్పు, లూజ్ లైన్లు, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చిన తక్షణమే అధికారులు స్పందించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోరుట్లలో విద్యుత్ బిల్లులకు సంబంధించి మూడు ఫిర్యాదులు, లూజ్ లైన్లపై మరో ఫిర్యాదు అందినట్లు తెలిపారు. కాగా, మండలంలో విద్యుత్ లైన్‌మెన్ల కొరత ఉందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి రాజేందర్ అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, కిషన్, ఎస్ఈ సాలియా నాయక్, మెట్‌పల్లి డీఈ గంగారాం, కోరుట్ల ఏడీఈ ఆంజనేయరావు, ఏఈలు శ్యామ్, సత్యనారాయణ, శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, జేఈఆర్వో ప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితాలు ప్రదర్శన

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

సారంగాపూర్/పెగడపల్లి/కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 11: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాల వివరాలను సారంగాపూర్, పెగడపల్లి, కోరుట్ల మండల పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డులపై మంగళవారం ఎంపీడీవోలు చౌడారపు గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మధులత, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు, పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, ప్రవీణ్‌కుమార్, కుమార్, అజీం, తదితరులు పాల్గొన్నారు.

మనుబోతును చంపిన పెద్దపులి

కొడిమ్యాల, ఫిబ్రవరి 11: శనివారంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మనుబోతును పెద్దపులి చంపి తిన్నది. రేంజర్ మొహినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెగుండం గ్రామం వెళ్లే దారిలో మనుబోతుపై పెద్దపులి దాడి చేసి చంపి తిన్నట్లు తెలిపారు. గ్రామస్తులు సమాచారం అందించగా ఘటనా స్థలానికి వెళ్లి చూడగా పెద్దపులి అని తెలిందని పేర్కొన్నారు. దీంతో శనివారంపేట, తిర్మలాపూర్, హిమ్మత్‌రావుపేట, రామ్‌సాగర్ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పశువులను రోడ్లపైకి వదిలితే జరిమానా

ధర్మపురి, ఫిబ్రవరి 11: పట్టణంలో పశువులను రోడ్లపైకి వదిలితే బంజెరు దొడ్డికి తరలించి, యజమానులకు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పశువులు రోడ్లపై సంచరించడంతో ధర్మపురి క్షేత్రానికి వచ్చే భక్తులు, పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత ధర్మపురిగా తీర్చిదిద్దేందుకు ప్రతి రోజూ దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయించవద్దని సూచించారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థికి ఆర్డీవో అభినందన

కోరుట్ల, ఫిబ్రవరి 11: పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థి అబ్బుల్ ముజిల్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. విద్యార్థిని ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ అబ్దుల్ బారీ, ప్రిన్సిపాల్ సెలీనా బారీ, చైర్మన్ హాదీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి నాయకులు ఏసీఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, నారెందుల శ్రీనివాస్, వేముల పోచమల్లు, చిట్ల గంగాధర్, బోగ దేవన్న, తునికి అంజన్న, బండారి మల్లికార్జున్, రవి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం ఇవ్వాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 11: కొత్త రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డుదారులకు ఈ నెల బియ్యం కేటాయించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గొల్లపల్లి, ఫిబ్రవరి 11: చందోలి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి దవాఖాన సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని రీజినల్ చైర్మన్ లయన్ తన్నీరు రాజేందర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 70 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. లయన్ సాయిని నరహరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్కు కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి లయన్ సాయిని నరహరి, కోశాధికారి లయన్ సాతాల సత్యనారాయణ, రీజినల్ సెక్రటరీ లయన్ పుచ్చకాయల మునీందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లయన్ బొమ్మన కుమార్, సర్వీస్ కమిటీ చైర్మన్ లయన్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రవీందర్, మాజీ ఎంపీటీసీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 11: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ శ్రీనీజ కోహికార్ తీర్పునిచ్చినట్లు సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన నల్లాల విక్రం–శ్రీలేఖకు 2014లో వివాహం జరిగింది. అదనంగా రూ. లక్ష కట్నం తీసుకురావాలని శ్రీలేఖను రమేశ్ తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో 2019 మార్చిలో భార్యపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో రమేశ్‌పై కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి శ్రీనీజ కోహికార్ కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం రమేశ్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

బీమా చెక్కు అందజేత

పెగడపల్లి, ఫిబ్రవరి 11: పెగడపల్లిలోని కేడీసీసీబీ ఖాతాదారు చెల్లోజి సత్యం ఇటీవల మృతిచెందాడు. కాగా, పీఎంఎస్‌బీవై కింద బీమా సొమ్ము రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. సత్యం భార్య మాధవికి మంగళవారం చెక్కు అందజేసినట్లు మేనేజర్ మైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శంకరాచారి, సిబ్బంది అర్జున్, రాజు, కిరణ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం

మారుతీనగర్, ఫిబ్రవరి 11: పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి బేతు భాస్కర్ దంపతులు మంగళవారం రూ. 50,116 పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంకు ఆనంద్, అన్నం నాగరాజు, సత్యం, వాసాల నరేశ్, హన్మాండ్లు, మురళి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పెగడపల్లికి చెందిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయిన్‌పల్లి సునీతాదేవి–లక్ష్మణ్‌రావు దంపతులు రూ.50 వేలు అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్రం తెలిపారు. ఆలయంలో సౌండ్ సిస్టం కొనుగోలుకు ఈ విరాళాన్ని దాత అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే, రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దుకాణాల నిర్వహణకు గానూ బుధవారం ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్రం పేర్కొన్నారు. కొబ్బరి కాయలు, బెల్లం, లడ్డూ, పులి హోర, తదితర దుకాణాల నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు వివరించారు.

కొడిమ్యాల, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరాలయానికి గ్రామానికి చెందిన జిలకరి తొంతుల అనసూర్య–నారాయణ దంపతులు రూ. 25,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నాగరాజు రమేశ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి హేయమైన చర్య

జగిత్యాల, ఫిబ్రవరి 11: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని రాష్ట్ర 6ఏ ఆలయాల ఉద్యోగుల సంఘం జేఏసీ కో–చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్చకులతో ఏమైనా అభ్యంతరాలు ఉంటే శాంతిపూర్వకంగా, సామరస్యంగా చర్చించి పరిష్కరించుకోవాలని, ఇలాంటి ఉన్మాద స్థితి పనికిరాదని హితవు పలికారు. అర్చకులపై దాడి చేసే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల, ఫిబ్రవరి 11: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని మడేళ్వర స్వామి ఆలయ ఆవరణలో భక్తులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సిరిసిల్ల పార్థసారథిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, ఫిబ్రవరి 11: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం సరికాదని ఆలయ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ కో–చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, రామరాజ్యానికి విరాళాలు సేకరించాలని ఒత్తిడి తేవడం సరికాదన్నారు.

ప్రేరణ తరగతులు నిర్వహించాలి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్–711 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా, పరీక్షల పట్ల భయం పోగొట్టేలా ప్రేరణ తరగతులు నిర్వహించాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశం, రాష్ట్ర కార్యదర్శి విజేందర్‌రావు, నర్సయ్య, రాజేంద్రప్రసాద్, ప్రమోద్‌కుమార్, రామ్‌ప్రసాద్, తిరుపతి, రాజమౌళి, సుదర్శన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాయికల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం 'ప్రగతి విజయయానం' పేరిట మంగళవారం స్థానిక ఓ కన్వెన్షన్ హాల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలె జయశ్రీ, ప్రిన్సిపాల్ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సరళిపై రైతులకు అవగాహన

కొడిమ్యాల, ఫిబ్రవరి 11: పూడూర్‌లోని రైతు వేదికలో గ్రామ పంటల సరళిపై పటం ద్వారా రైతులకు రాజన్న సిరిసిల్ల జిల్లా బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. వారం రోజులుగా గ్రామంలో సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన విద్యార్థులు రైతు వేదికలో పటం వేసి, కార్యాలయాలు, పంటలు రోడ్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి, ఏఈవోలు గ్రీష్మ, శ్రీలత, మాజీ సర్పంచ్ వెల్ముల రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 11: నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమి (సర్వే నంబర్ 437)లో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను మంగళవారం పట్టుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. జేసీబీకి రూ. 25 వేలు, మూడు టిప్పర్లకు రూ. 15 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఆర్ఐ శంశొద్దీన్, రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.

కొడిమ్యాల, ఫిబ్రవరి 11: నమిలకొండలోని పాలపెల్లి చెరువు పక్కన డంపు చేసిన మట్టిని జేసీబీ ద్వారా రెండు టిప్పర్లలో పోస్తూ తరలిస్తుండగా తహసీల్దార్ రమేశ్ వెళ్లి పట్టుకున్నారు. టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి ఉందా లేదనే విషయంలో ఇప్పటి వరకు కార్యాలయానికి టిప్పర్లకు సంబంధించిన వారు ఎవరూ రాలేదని అధికారులు తెలిపారు. కాగా, టిప్పర్లలో మట్టి నింపిన జేసీబీని మాత్రం వదిలేయడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

హరితహారం చెట్ల నరికివేత



రహదారి పక్కన గల హరితహారం చెట్లను కొట్టివేసిన విద్యుత్ సిబ్బంది

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 11: ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా గత ప్రభుత్వం హరితహారం కింద వనాలను సృష్టించగా, విద్యుత్ సిబ్బంది ఇష్టారాజ్యంగా కొట్టేస్తున్నారు. కోరుట్ల మండలం కల్లూర్ శివారులో రహదారి పక్కన హరితహారం వృక్షాలను విద్యుత్ సిబ్బంది ఇటీవల నరికివేశారు. వైర్ల కింద ఉన్నాయని, సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తొలగించినట్లు చెప్పారు.

వేసవి దృష్ట్యా ముందస్తు కార్యాచరణ

జగిత్యాల, ఫిబ్రవరి 11: వేసవి నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా ముందస్తు కార్యాచరణ చేపట్టామని జగిత్యాల సూపరింటెండెంట్ ఇంజినీర్ ఈ సాలియా నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఈ నెల 7న గరిష్ఠంగా విద్యుత్ డిమాండ్ 4.738 మిలియన్ యూనిట్లు నమోదైనట్లు తెలిపారు.